సాక్షి
రంగారెడ్డి

గురువారం । 30 । జనవరి । 2025



ప్రాణాలు పోతున్న పట్టదా?

హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టాలని చేపట్టిన దీక్షకు ప్రజలు పెద్ద ఎత్తున మద్దతిస్తున్నారు. 8లో▸



మూడు నెలలుగా జీతాల్లేవ్

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం ఎంపీడీఓకు వినతిపత్రం ఇచ్చారు. 8లో▸



కుక్కల దాడిలో జింక మృతి

కుక్కల దాడిలో మచ్చల జింక(స్పోటెడ్ డీర్) మృత్యువాత పడిన ఘటన కడ్తాల్ మండల పరిధిలో చోటుచేసుకుంది. 8లో▸

న్యూస్‌రీల్

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం: 2025–26 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లీలావతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని అన్ని గురుకుల విద్యాలయాల్లో, సైనిక్, ఫైన్ ఆర్ట్స్ స్కూల్స్‌లోఐదు నుంచి 9వ తరగతి వరకు అడ్మిషన్లు పొందేందుకు అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 1వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9704550233 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు ఇవ్వండి

శేఖర్‌గౌడ్



తహసీల్దార్ పార్థసారథికి వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

షాద్‌నగర్‌రూరల్: దివ్యాంగులకు ప్రభుత్వం అంత్యోదయ రేషన్ కార్డులు ఇవ్వాలని జాతీయ దివ్యాంగుల హక్కుల వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ పార్థసారథికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. అంత్యోదయ కార్డుల కోసం పదేళ్లుగా దరఖాస్తులు ఇస్తున్నా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కుటుంబానికి 35 కిలోల చొప్పున రేషన్ బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మనీల, శ్రీను, రిజ్వానా, అంజమ్మ, జహంగీర్, చెన్నయ్య, కొమురయ్య, రాములమ్మ, రాణి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

‘వావ్’ నేదునూరు మోడల్ స్కూల్



సంబురాల్లో నేదునూరు మోడల్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కందుకూరు: ఐటీసీ సంస్థ వావ్ ఇంటర్ స్కూల్ రీసైక్లింగ్ చాంపియన్ షిప్‌లో నేదునూరు మోడల్ స్కూల్ రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలవగా.. పాఠశాల విద్యార్థి దిలీప్ కుమార్ ప్రథమ బహుమతి సాధించాడు. ఈ మేరకు బుధవారం ప్రిన్సిపాల్ విష్ణుప్రియ ఆధ్వర్యంలో పాఠశాలలో సంబురాలు నిర్వహించారు. అవార్డుకు రావడానికి కారణమైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తమ ఇంటి పరిసరాలతో పాటు గ్రామం, పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసాచారి, కుముదిని, పరమేశ్, రమణ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో 14 రోజుల రిమాండ్



గురుమూర్తి (మాస్కు ధరించిన వ్యక్తి)ని కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

రంగారెడ్డి కోర్టులు: మీర్‌పేట్ ఠాణా పరిధిలో భార్యను అతికిరాతకంగా చంపేసి ముక్కలుగా నరికిన నిందితుడు గురుమూర్తిని పోలీసులు బుధవారం రంగారెడ్డి జిల్లా 6వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరుపరిచారు. ఈ మేరకు నిందితుడికి వచ్చే నెల 11వ తేదీ వరకు వరకు రిమాండ్ విధించారు. భార్య వెంకట మాధవిని హత్య చేసిన కేసులో గురుమూర్తిని ఇటీవల పోలీసులు అరెస్టు చేసి విచారణ చేపట్టారు. వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం కట్టుదిట్టమైన భద్రత మధ్య కోర్టులో హాజరుపరిచారు.



కన్నుల పండువగా రథోత్సవం

మండల కేంద్రంలోని శ్రీబాలజీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద బుధవారం రథోత్సవం కన్నుల పండువగా సాగింది. ఆలయ అర్చకుడు వామనాచార్యుల ఆధ్వర్యంలో ఆలయం నుంచి గ్రామంలోని రచ్చబండ వరకు రథం ఊరేగింపు నిర్వహించారు. ఈ వేడుకల్లో మండల వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చేవెళ్ల సీఐ భూపాల్‌శ్రీధర్, ఎస్‌ఐలు శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. – చేవెళ్ల



జాతీయ అథ్లెటిక్స్‌లో రాణించాలి

డీఈఓ సుశీందర్‌రావు



అక్షితను సన్మానిస్తున్న డీఈఓ సుశీందర్‌రావు

యాచారం: పారా అథ్లెటిక్స్ పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థి అక్షితను జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అభినందించారు. బుధవారం ఆమె డీఈఓకు తాను సాధించిన బంగారు పతకాలను చూపింది. అనంతరం సుశీందర్‌రావు అక్షితను శాలువాతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలని సూచించారు. విద్యాశాఖ నుంచి తాము అన్ని విధాలుగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యాచారం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నర్సింహ, పీడీ మల్లేష్ ఉన్నారు.

పవర్‌పై నజర్!



- వేసవిలో పెరగనున్న విద్యుత్ డిమాండ్
- సమ్మర్ యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేసిన డిస్కం
- అంచనాలకు మించి ఏర్పాట్లు
- జోన్ల వారీగా అధికారుల ప్రత్యేక సమీక్షలు
- భవిష్యత్ డిమాండ్‌పై చర్చలు

రంగారెడ్డి జోన్‌లో 25 శాతం..

2024లో జిల్లాలో రికార్డు స్థాయిలో 1800 మెగావాట్ల (35 ఎంయూ)విద్యుత్ డిమాండ్ నమోదైంది. ఈ సమ్మర్‌లో విద్యుత్ డిమాండ్ ఏకంగా 2250 మెగావాట్లకు చేరుకునే అవకాశం ఉన్నట్లు డిస్కం ఇంజినీర్లు అంచనా వేశారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఇప్పటికే 254 (11కేవీ) ఫీడర్లు, 21(33కేవీ) ఫీడర్లు, 81 పీటీఆర్‌లు, 1055 డీటీఆర్‌లను అదనంగా మంజూరు చేసుకుని, ఇప్పటికే 50 శాతం పనులు పూర్తి చేశారు. ఫిబ్రవరి 15లోగా మిగిలిన 50 శాతం పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దయించింది.

- ఈ మేరకు బుధవారం రాజేంద్రనగర్ ఎస్‌ఈ ఆఫీసులో రంగారెడ్డిజోన్ సీజీఎం చీఫ్ ఇంజనీర్ పాండ్య, ట్రాన్స్‌కో సీఈ చిరంజీవి, సైబర్ సర్కిల్ ఎస్‌ఈ చంద్రశేఖర్, సరూర్‌నగర్ ఎస్‌ఈ మాధవరెడ్డి, రాజేంద్రనగర్ ఎస్‌ఈ మోహన్‌లతో పాటు ఆయా డివిజన్లకు సంబంధించిన డీఈలు, ఏడీఈలు, ఏఈలతో సమావేశమై, సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌పై చర్చించారు. రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా చూడాలని సూచించారు. ఆ మేరకు విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరుగుతున్న కోకాపేట్, నార్సింగి, మోకిల, కొండాపూర్, చందానగర్, గచ్చిబౌలి, మణికొండ సహా సన్‌సిటీ, కిస్మత్‌పూర్, ఇబ్రహీంబాగ్, శంషాబాద్, తుక్కుగూడలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.



సమీక్షలో మాట్లాడుతున్న జోన్ సీజీఎం సీఈ పాండయ్య,ట్రాన్స్‌కో ఏఈ చిరంజీవి తదితరులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: గతంలో ఎన్నడూ లేనంతగా వచ్చే వేసవిలో గ్రేటర్ జిల్లాల్లో విద్యుత్ డిమాండ్ నమోదు కాబోతున్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అంచనా వేసింది. ఆ మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా లైన్ల పునరుద్ధరణ పనులు చేపట్టింది. ఇప్పటికే సబ్‌స్టేషన్లలోని పీటీఆర్‌ల సామర్థ్యం పెంపు, ఫీడర్లపై దెబ్బతిన్న జంపర్లు, ఇన్సులేటర్ల గుర్తింపు, ఆయిల్ లీకేజీలు, ఇతర సాంకేతిక సమస్యలు వెలుగు చూస్తున్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్త వాటిని అమర్చే ప్రక్రియ దాదాపు పూర్తి కావచ్చింది. మిగిలిన ఒకటి రెండు పనులను కూడా ఫిబ్రవరి 15లోగా పూర్తి చేయాలని ఆదేశించింది. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఈ మేరకు బుధవారం ట్రాన్స్‌కో, సీపీడీసీఎల్ (మేడ్చల్, రంగారెడ్డి జోన్ల సీజీఎంలు) క్షేత్ర స్థాయిలో పర్యటించి, ఎస్‌ఈలు, డీఈలు, ఏఈలు, ఏడీఈలతో ఆయా ఏర్పాట్లపై చర్చించారు. ఫిబ్రవరి 15లోగా మిగిలిన పనులను సైతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఎల్సీలకు అనుమతి ఇవ్వబోమని స్పష్టం చేశారు.

ఒక్కో జోన్‌కు ఒక్కో నోడల్ ఆఫీసర్..

గ్రేటర్ జిల్లాల పరిధిలో 2024లో మే 3న అత్యధికంగా 4,357 మెగావాట్లు (90.86 మిలియన్ యూనిట్లు) విద్యుత్ వినియోగం నమోదైంది. అదే

డిసెంబర్ 31 వరకు విద్యుత్ కనెక్షన్లు ఇలా..

జిల్లా	కనెక్షన్లు
హైదరాబాద్	21,79,904
రంగారెడ్డి	19,31,842
మేడ్చల్	17,10,269
సంగారెడ్డి	6,63,678
వికారాబాద్	2,44,671

2025లో ఈ డిమాండ్ 4,800 నుంచి 5000 మెగావాట్లకు (100 ఎంయూలకు) చేరుకునే అవకాశం ఉన్నట్లు డిస్కం అంచనా వేసింది. విద్యుత్ ప్రమాదాలు, భవిష్యత్ డిమాండ్లను దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఒక్కో జోన్‌కు ఒక్కో అధికారిని డైరెక్టర్/సీజీఎం స్థాయి అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించింది.

మేడ్చల్ జోన్‌లో 15 శాతం..

2024 మే నెలలో రికార్డు స్థాయిలో 1,048 మెగావాట్లు (24.35 ఎంయూలు) విద్యుత్ డిమాండ్ నమోదైంది. 2025 సమ్మర్‌లో మరో 15 శాతం అదనపు డిమాండ్ నమోదయ్యే అవకాశం ఉన్నట్లు మేడ్చల్ జోన్ ఇంజినీర్లు అంచనా వేశారు. ఆ మేరకు రూ.200 కోట్ల అంచనా వ్యయంతో బౌరంపేటలో నిర్మించిన 132 కేవీ సబ్‌స్టేషన్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. మౌలాలి, ఎల్బీఎం 132 కేవీ సబ్‌స్టేషన్‌లో పీటీఆర్‌ల సామర్థ్యాన్ని 50 ఎంవీఏ నుంచి 80 ఎంవీఏకు పెంచారు.

- షాపూర్‌నగర్, మేడిపల్లి, బీఎల్‌నగర్, బోడుప్పల్, ఉప్పల్ భగాయత్‌లలో రూ.37.83 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు 33/11 కేవీ సబ్‌స్టేషన్లు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్లలోని 14 పీటీఆర్‌ల సామర్థ్యం పెంపుతో పాటు 762 కొత్త డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు, 18 సబ్‌స్టేషన్లు సహా, 145 కొత్త 11 కేవీ లైన్లను ఇంటర్ లింకింగ్ పనులు చేపట్టినట్లు మేడ్చల్ జోన్ చీఫ్ ఇంజనీర్ ఎ.కామేష్ ప్రకటించారు.
- ఈ మేరకు ఉప్పల్ సర్కిల్ ఆఫీసులో మేడ్చల్ ఎస్‌ఈ రవికుమార్, హబ్సిగూడ ఎస్‌ఈ బ్రహ్మం, ట్రాన్స్‌కో ఎస్‌ఈ జి.లక్ష్మణ్‌రాజ్‌లు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చేపట్టిన పనులను మీడియాకు వెల్లడించారు. విద్యుత్ అంతరాయాలు, ప్రమాదాలపై 1912 కాల్‌సెంటర్ లేదా హబ్సిగూడ కాల్ సెంటర్ 9491039018, మేడ్చల్ కాల్ సెంటర్ 738 2618971 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు.

పేదలకే సంక్షేమ ఫలాలు

- పథకాల అమలుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- వచ్చే నెల 10లోపు అర్హులు, అనర్హుల జాబితా సిద్ధం చేయాలి
- దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు
- మోడల్ నియోజకవర్గంగా ఇబ్రహీంపట్నం
- సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: ‘ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పేదలకే దక్కాలి.. వీటిని పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదే.. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదు’అని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఏడు పథకాలపై వివిధ శాఖల అధికారులతో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి వివిధ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకాల లబ్ధిదారుల ఎంపికతోపాటు సక్రమంగా అమలు చేసే బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, ఈజీఎస్, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే ఆయా పథకాల అర్హుల జాబితాను రూపొందించడం సులువుగా మారుతుందన్నారు. ఉచిత విద్యుత్, రూ.500లకే వంట గ్యాస్ పథకాలు అందడం లేదని ఫిర్యాదులందుతున్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. రాజకీయాలకు అతీతంగా.. పారదర్శకంగా రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల లబ్ధిదారుల ఎంపిక ఉండాలన్నారు. ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారో చెప్పాలని అధికారులను ప్రశ్నించగా యాచారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి పది రోజుల గడువు కోరారు. ఫిబ్రవరి 10లోపు వివిధ పథకాల అర్హుల జాబితా సిద్ధం చేయాలని.. ఎందుకు అనర్హులో తెలియజేసేలా జాబితాలో పొందుపరచాలని చెప్పారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులతోపాటు గ్రామాల్లోని రాజకీయ పక్షాలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులను సైతం సర్వే చేస్తున్న క్రమంలో అధికారులు వెంటబెట్టుకుని వెళ్లాలన్నారు. పథకాలు నూటికి నూరు శాతం అమలు చేయాల్సిందే అన్నారు. నియోజకవర్గ పరిధిలో ఏ రూట్లో బస్సు సర్వీసులున్నాయి.. అదనంగా ఎన్ని బస్సులు కావాలో నివేదిక ఇవ్వాలని ఆర్టీసీ డీపీ మేనేజర్ వెంకటనర్సప్పను ఎమ్మెల్యే ఆదేశించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేద్దామన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ అనంతరెడ్డి, ఇబ్రహీంపట్నం స్పెషలాఫీసర్ నవీన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు గురునాథ్‌రెడ్డి, చిలుక మధుసూధన్‌రెడ్డి, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, సివిల్ సప్లై, ఉపాధిహామీ అధికారులు హాజరయ్యారు. అనంతరం ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల మండలాల బాధితులకు మంజూరైన రూ.42.56లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

విధులకు అడ్డొస్తే ఫిర్యాదు చేయండి

విధి నిర్వహణలో ఎవరైనా అడ్డుపడితే పోలీసులకు ఫిర్యాదు చేయండి.. మీకు అండగా ఉంటామని ఎమ్మెల్యే అన్నారు. అధికారులు సైతం ప్రభుత్వంలో భాగస్వాములేనని వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు.

సివిల్ సప్లై అధికారిపై ఆగ్రహం

ఉచిత గ్యాస్ పథకం కింద ఎంత మంది లబ్ధి పొందుతున్నారో సివిల్ సప్లై డీటీ వినోద్‌కుమార్‌ను ఎమ్మెల్యే మల్‌రెడ్డి ప్రశ్నించగా.. కనుక్కుంటాను అని అధికారి సమాధానం చెప్పడంతో మండిపడ్డారు. కనీస సమాచారం లేకుండా ఎందుకొచ్చావ్.. పనిలేక ఈ సమావేశాన్ని పెట్టుకున్నామా అంటూ గద్దించారు. వెంటనే లబ్ధిదారుల జాబితా తెలుసుకోవాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

సంక్షేమ సంబురం

పోలెపల్లిలో ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

ఆమనగల్లు: ప్రభుత్వం జనవరి 26 ప్రవేశపెట్టిన నాలుగు సంక్షేమ పథకాలను మండలానికి ఓ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అర్హులకు అందజేస్తున్నారు. మండల పరిధిలోని పోలెపల్లిలో 122 మందికి ఇందిరమ్మ ఇళ్లు, 160 మందికి రేషన్‌కార్డులు, 11 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 1,157 మందికి రైతు భరోసా అందజేశారు. పోలెపల్లి గేటు నుంచి మంగళికుంట తండాకు వరకు రోడ్డు మరమ్మతుకు రూ.కోటి మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. టపాసులు కాల్చి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బలరాం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి అభినవ్‌రెడ్డి, నాయకులు అంజన్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బుచ్చిరెడ్డి, జంగయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న పోలెపల్లి గ్రామస్తులు

కాంగ్రెస్, బీఆర్‌ఎస్.. బొమ్మాబొరుసు

- హామీల అమలులో రెండు పార్టీలు విఫలం
- రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్

చేవెళ్ల: కాంగ్రెస్ ప్రభుత్వం సైతం బీఆర్‌ఎస్ మాదిరిగానే హామీల అమలులో విఫలమైందని రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. మండల కేంద్రంలోని షాబాద్ చౌరస్తాలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జెండా పండుగతో బీజేపీ ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉంటామని చాటి చెబుతున్నామన్నారు. పదేళ్ల మోదీ పాలనలో సంక్షేమ పథకాలు ప్రారంభించారని.. దళారీ వ్యవస్థ లేకుండా రూ.25లక్షల కోట్ల ఆదాయం పేదలు, రైతుల అకౌంట్లలో జమ చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందని మండిపడ్డారు. మాటలతో పబ్బం గడుపుతున్నాడన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్ రాబోతుందన్నారు. రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని.. బీజేపీ పాలనలో రైతులకు, యువతకు, ప్రజలకు ప్రణాళిక ప్రకారం ఏమి చేయాలో ఆలోచించి ముందుకు వెళ్తామన్నారు. ఈ జెండా కార్యక్రమాలతో ప్రజలకు బీజేపీ ఉందనే భరోసాను కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రజల వద్దకు వెళ్లి బీజేపీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను తెలపడంతో పాటు ప్రతిపక్షాల ఆరోపణలకు సమాధానాలు చెబుతామన్నారు.



బీజేపీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఎంపీలు డాక్టర్ లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

ఏడు స్థానాల్లో గెలుస్తాం: ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ చిత్తశుద్ధితో పనిచేసే పార్టీ అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ హామీని నెరవేరుస్తూ దేశాన్ని అభివృద్ధి చేసుకుంటూ వెళ్తోందన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి శశిధర్‌రెడ్డి, కేఎస్.రత్నం, రాష్ట్ర నాయకుడు కంజర్ల ప్రకాశ్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, పార్టీ మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు

మూడు నెలలుగా జీతాల్లేవ్

- ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలి
- ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల డిమాండ్
- ఎంపీడీఓకు వినతిపత్రం అందజేత

కద్తాల్: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ.. ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం ఎంపీడీఓ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఏల సంఘం నాయకులు మాట్లాడుతూ.. మూడు నెలలుగా జీతాలు అందక అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాల్లో తాము నిర్విరామంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా విజయవంతానికి ఎంతో కృషి చేశామన్నారు. కానీ సకాలంలో వేతనాలు అందక కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే తమ సమస్యలపై దృష్టి సారించాలని, పెండింగ్ జీతాలతో పాటు, ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ లలిత, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు కాలే వెంకటేశ్, శ్రీను, పి.శ్రీను, పట్నం శ్రీను, రమేశ్, యాదగిరి, సత్తయ్య, సువర్ణ, బీబీ బేగం, ఆపరేటర్ నిఖిల్ తదితరులు ఉన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టదా?

హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరించాలి: దీక్షలో మల్లారెడ్డి

చేవెళ్ల: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టాల్సిందేనని స్థానికంగా పెద్ద ఎత్తున ప్రజామద్దతు కూడగట్టుకుంది. మండల కేంద్రంలో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ కోసం పోతుగల్‌కు చెందిన మల్లారెడ్డి రిలే నిరాహార దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. ఈ దీక్షకు బుధవారం చేవెళ్ల ప్రాంతవాసులు సంఘీభావం ప్రకటించారు. దీక్షకు అవసరమైనన్ని రోజులు టెంట్ ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు వచ్చారు. అన్ని వర్గాల నుంచి మద్దతు రావడం సంతోషంగా ఉందని మల్లారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ అకాడమి నుంచి మన్నేగూడ వరకు నాలుగులైన్ల రోడ్డు వేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. వచ్చే నెల 5వ తేదీ వరకు రిలే దీక్షకు ఏసీపీ నుంచి అనుమతి పొందినట్లు చెప్పారు. అప్పటి వరకు కూడా ప్రభుత్వం స్పందించక పోతే రహదారి విస్తరణ చేయాల్సిన పోలీస్ అకాడమి నుంచి మన్నేగూడ వరకు పాదయాత్ర చేసి నిరసన తెలుపుతానన్నారు. అప్పటికి ప్రయోజనం లేకపోతే హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఒక్క రోజు ధర్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు రోడ్డు విషయంలో వెంటనే స్పందించాలన్నారు. ప్రజల ప్రాణాలు పోతున్నా మీకు పట్టాదా అని ప్రశ్నించారు. ఈ దీక్ష ఉద్యమంగా మారక ముందే రహదారి విస్తరణ చేపట్టాలని హెచ్చరించారు. కార్యక్రమంలో చేవెళ్లకు చెందిన పలు రాజకీయ పార్టీల నాయకులు స్వచ్ఛందంగా మద్దతు తెలిపి కాసేపు దీక్షలో కూర్చున్నారు.



మల్లారెడ్డికి మద్దతు తెలుపుతున్న నాయకులు

స్నేహితుల మధ్య గొడవ

కేసు నమోదు

కేశంపేట: పాఠశాలలో కలిసి చదువుకున్న స్నేహితుల మధ్య జరిగిన గొడవలో ఓ బాలుడిపై కేసు నమోదైంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సంతాపూర్‌కు చెందిన మద్దు సందీప్ మంగళవారం సాయంత్రం తన అమ్మమ్మ వారి గ్రామమైన కొత్తపేటకు వెళ్లాడు. తనతో కలిసి చదువుకున్న మిత్రులు అభిషేక్, నవీన్, భాను ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఉన్నారని తెలుసుకుని, కలిసేందుకు వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత అభిషేక్, సందీప్ మధ్య గొడవ మొదలైంది. దీంతో సందీప్ అక్కడి నుంచి వెళ్లిపోతుండగా అభిషేక్ పరుష పదజాలంతో తిడుతూ రాడ్‌తో తనపై దాడి చేశాడని సందీప్ తెలిపాడు. దీంతో మంగళవారం రాత్రి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మృతదేహం

మంచాల: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం మండలంలోని అజ్జిన తండా సమీపంలో లభ్యమైంది. సీఐ మధు కథనం ప్రకారం.. తండా సమీపంలో రోడ్డు పక్కనే బుధవారం ఉదయం ఓ వ్యక్తి(45) విగత జీవిగా పడి ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. గ్రామంలో భిక్షాటన చేసే వ్యక్తిగా ప్రాథమికంగా పోలీసులు గుర్తించారు. ఆకలితో చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. గుర్తు తెలియని మృతదేహం కేసుగా నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుడు పింకు, తెలుపు రంగు చొక్కా, బ్లూకలర్ ప్యాంటు ధరించాడన్నారు. సమాచారం కోసం మంచాల ఠాణాను సంప్రదించాలని సూచించారు.

కాలువలో పడి..

షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన బైపాస్ రహదారి సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ అనంతరాములు కథనం ప్రకారం.. జాతీయ రహదారి పక్కన బుచ్చిగూడ సర్వీస్ రోడ్డు దగ్గర కాలువలో గుర్తు తెలియని వ్యక్తి(42) మృతదేహం పడి ఉంది. మృతుడి శరీరంపై పెసరు కలర్ టీ షర్టు, నీలి కలర్ నైట్ ప్యాంటు ధరించి ఉన్నాడు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి ఆచూకీ తెలియరాలేదు. మృతుడు ప్రమాదవశాత్తు గత మూడు రోజుల క్రితం గుంతలో పడి చనిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసినా, వివరాలు లభించినా స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఎదురెదురుగా బైకులు ఢీ

కేశంపేట: ఎదురెదురుగా వచ్చిన రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో వ్యక్తికి గాయాలైన సంఘటన మండల పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని లేమామిడి గ్రామానికి చెందిన బైండ్ల శ్రీకాంత్ శంషాబాద్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయన విధులకు వెళ్లేందుకు గ్రామం నుంచి శంషాబాద్‌కు వెళ్తుండగా, మండల పరిధిలోని పాటిగడ్డ గ్రామానికి చెందిన పాపకంటి పరమేశ్ కేశంపేటకు వస్తుండగా రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో శ్రీకాంత్ కాలికి గాయమవ్వడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

చౌటుప్పల్: విజయవాడ– హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి లింగోజిగూడెం గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌కు చెందిన బ్రహ్మం(32) బుధవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం వచ్చాడు. రాత్రి సమయంలో గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బార్ ముందు జాతీయ రహదారి డివైడర్‌పై మృతిచెంది పడి ఉన్నాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తుండగా.. అదే సమయంలో మృతుడి సెల్‌ఫోన్‌కు ఫోన్ రావడంతో అతడి వివరాలు తెలిశాయి. అయితే బ్రహ్మం ఎందుకు లింగోజిగూడెం వద్దకు వచ్చాడు, ఎప్పుడు వచ్చాడు..? వంటి వివరాలు తెలియాల్సి ఉంది. హైవే దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందినట్లుగా తెలుస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై అదుపు తప్పి ఓ లారీ బోల్తా పడింది. వివరాలు.. యాచారం వైపు నుంచి మాల్‌కు వెళ్తున్న ఓ లారీ బుధవారం ఉదయం యాచారం పోలీస్ స్టేషన్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఓ కారును తప్పించబోయి అదుపు తప్పింది. రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టులో పడి పోయింది. కారులో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాచారం సీఐ నర్సింహారావు తెలిపారు.

జాతీయ క్రికెట్ పోటీలకు ముగ్గురు బాలికలు



అండర్–19 విభాగంలో ఎంపికైన అనూష, స్రవంతి



అండర్–17కు యశస్విని

షాద్‌నగర్‌రూరల్: జాతీయ స్థాయిలో నిర్వహించే క్రికెట్ పోటీలకు కమ్మదనం బాలికల క్రికెట్ అకాడమీ విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత విద్యార్థినులను అభినందించారు. కమ్మదనం గురుకులలో ఇంటర్(ఎంపీసీ) మొదటి సంవత్సరం చదువుతున్న అనూష, స్రవంతి అండర్–19 విభాగంలో, 9వ తరగతి చదువుతున్న యశస్విని అండర్–17 విభాగంలో జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయిలో నిర్వహించే అండర్–19 పోటీలు రాజస్థాన్‌లోని ఉదయ్‌ఘఢ్‌లో, అండర్–17 పోటీలు హర్యానాలోని పంచకులలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యుల్లత మాట్లాడుతూ.. కమ్మదనం క్రికెట్ అకాడమీ విద్యార్థినులు చదువుతో పాటుగా క్రీడల్లోనూ ఆసక్తిని కనబరుస్తున్నారని అన్నారు. క్రికెట్ కోచ్ అబిద్ హుస్సేన్ ఆధ్వర్యంలో విద్యార్థినులు ప్రతిరోజు శిక్షణ పొందుతున్నారని చెప్పారు. జిల్లా, రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన బాలికలు జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికవడం హర్షనీయమని అన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



జింక కళేబరం

కద్తాల్: కుక్కల దాడిలో మచ్చల జింక(స్పోటెడ్ డీర్) మృత్యువాత పడిన సంఘటన మండల పరిధిలోని పిరమిడ్ సమీపాన ఉన్న వ్యవసాయ పొలంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. ఈ విషయాన్ని గమనించిన రైతు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి హుస్సేన్‌తో పాటు, అటవీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి– పుల్లేరుబోడ్‌తండా సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి జింక బయటకు రావడంతో కుక్కలు దాడి చేశాయని భావిస్తున్నారు. స్థానిక వెటర్నరీ డాక్టర్ భానునాయక్ ఆధ్వర్యంలో జింకకు పోస్టుమార్టం నిర్వహించారు. కుక్కల దాడితోనే తీవ్ర గాయాల పాలై మృత్యువాత పడిందని వైద్యుడు తెలిపారు.

మొగిలిగిద్దను మండలముగా ప్రకటించండి

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్: చరిత్ర కలిగిన మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల 150వ వార్షికోత్సవానికి విచ్చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి గ్రామాన్ని మండలముగా ప్రకటించాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో మొగిలిగిద్ద గ్రామాన్ని మండలముగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రస్తుతం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఉద్యమం చేశారన్నారు. మండల ఏర్పాటు ఉద్యమ సమయంలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న శంకర్ మాటలకు ఎంతో మంది నాయకులు తమ పదవులకు రాజీనామాలు చేశారన్నారు. ప్రస్తుతం పాఠశాలకు వేడుకలకు విచ్చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి మొగిలిగిద్దతో పాటు చించోడ్‌ను కూడా మండలముగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీఎం రెండు మండలాలు ప్రకటిస్తే ఒక్కో మండల అభివృద్ధి కోసం రూ.కోటి చొప్పున రూ.రెండు కోట్ల చెక్కును అందజేస్తానన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి ఎన్ని కోట్లు ఖర్చు అవుతాయి, ఎంత మంది ఏమి ఆశించి రూ.లక్షల్లో చందాలు ఇస్తున్నారని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు రాధాకృష్ణ, గుట్టరాజు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం

యాచారం: అతి వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి ముందుగా వెళ్తున్న స్కూటీని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలై మృతి చెందగా, మరొకరు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం దక్షిణ దినాజ్‌పూర్ ప్రాంతానికి చెందిన బాపి రెహమాన్(40), జుబేల్ ఇద్దరు యాచారం మండల పరిధిలోని తక్కళ్లపల్లి ఆర్‌వీవీ హచరీస్‌లో కూలీలుగా పనిచేస్తున్నారు. తక్కళ్లపల్లి గ్రామం నుంచి మంగళవారం రాత్రి స్కూటీపై యాచారం వచ్చి తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలో యాచారం నుంచి మాల్ వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన రెహమాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన జుబేల్ నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాచారం సీఐ నర్సింహారావు తెలిపారు.

కళాశాల బస్సును ఢీకొట్టిన డీసీఎం

అధ్యాపకురాలితో పాటు విద్యార్థులకు గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన కళాశాల బస్సు

అబ్దుల్లాపూర్‌మెట్: వెనక నుంచి వచ్చిన డీసీఎం కాలేజీ బస్సును ఢీ కొట్టడంతో అధ్యాపకురాలితో పాటు పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుంతపల్లి అవంతి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బస్సు బుధవారం ఉదయం నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్డు నుంచి అధ్యాపకులు, విద్యార్థులను తీసుకుని వస్తోంది. మార్గ మధ్యలో మండల కేంద్రంలోని మయూరి కాంటా వద్ద బస్సు యూ టర్న్ అవుతుండగా.. నగరం నుంచి చౌటుప్పల్ వైపునకు వెళ్తున్న ఓ డీసీఎం అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనతో బస్సు ఒక్కసారిగా కుదుపునకు గురై అందులో ఉన్న అధ్యాపకురాలు హైమావతితో పాటు పలువురు విద్యార్థులు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రులను సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. కళాశాల ప్రతినిధి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్య

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తి గ్రామం నుంచి ఈ నెల 23న ఇంటి నుంచి వెళ్లిపోయిన జాపాల లక్ష్మయ్య(70) చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబ కలహాలతో ఆయన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. నాలుగైదు రోజులుగా ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు పలు ప్రాంతాలతో పాటు పుణ్యక్షేత్రాల్లో వెతికారు. చివరికి లక్ష్మయ్య గ్రామం సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక వ్యవసాయ కూలీలు కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహం గుర్తించి కుటుంబ సభ్యులకు తెలియజేయగా లక్ష్మయ్య నేనని నిర్ధారించారు. అనంతరం అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

రాజేంద్రనగర్: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతోపాటు వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై సలహాల కోసం గురువారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ రాజేంద్రనగర్ డిపో మేనేజర్ బద్రీనారాయణ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాజేంద్రనగర్ డిపోలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. రాజేంద్రనగర్ పరిసర ప్రయాణికులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

70 శాతం హైబ్రిడ్ విత్తన తయారీ ఇక్కడే..



'ఎకో' సంస్థ సమావేశంలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

రాయదుర్గం: దేశంలోని 70 శాతం హైబ్రిడ్ విత్తనాల తయారీ తెలంగాణ, ఏపీలలోనే జరుగుతోందని ఎనేబులింగ్ చైల్డ్ అండ్ హ్యూమన్ రైట్స్ విత్ సీడ్ ఆర్గనైజేషన్స్ (ఈసీహెచ్ఆర్ఎస్ఈ–ఎకో) సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ దావులూరి పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో బుధవారం ఎకో సంస్థ ఆధ్వర్యంలో విత్తన సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పలువురు నిపుణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని గద్వాల, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు హైబ్రిడ్ విత్తన తయారీకి అనాదిగా కేంద్రాలుగా కొనసాగుతున్నాయన్నారు. హైబ్రిడ్ సీడ్ తయారీ రంగంలో బాల కార్మికులు, మానవ హక్కులు, కనీస వేతనాల అమలు, వ్యవసాయ కార్మికుల కొరత వంటి పలు సమస్యలు ఉన్నాయన్నారు. వీటిపై సమగ్ర చర్చలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈసీహెచ్ఓ ఫోరమ్ అధ్యక్షురాలు యూపీఎల్ ఆనంద మాట్లాడుతూ విత్తన పరిశ్రమలో నైతిక పద్ధతులు భవిష్యత్తు కోసం మార్గాన్ని రూపొందిస్తాయన్నారు. అంతకు ముందు సంస్థ బ్రోచర్‌ను అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీయూ, ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు, విత్తన సంస్థలు, ఎంవీ ఫౌండేషన్, ఎకో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

'మహా హారతి' నిర్వాహకులపై కేసు నమోదు

రాంగోపాల్‌పేట్: హుస్సేన్ సాగర్ బోటులో అగ్ని ప్రమాదానికి సంబంధించి.. కార్యక్రమ నిర్వాహకులపై లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ నెల 26వ తేదీన నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజాలో భారత మాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహా హారతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హుస్సేన్ సాగర్‌లో బాణసంచా కాలుస్తుండగా ప్రమాదం జరిగిన విషయం విదితమే. ఈ ఘటనలో నాగారంకు చెందిన అజయ్, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన టాటా ఏస్ డ్రైవర్ గణపతి మరణించారు. ఘటన జరిగిన అదే రోజు లేక్ పోలీసులు ఫైర్ ఆక్ట్‌తో పాటు (302) ఏ కింద కేసులు నమోదు చేశారు. అయితే ఈ ఘటనలో ఇద్దరు మరణించడంతో నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే ఘటన జరిగిందని పోలీసులు 304 ఏ సెక్షన్లకు మార్పులు చేశారు. ఫౌండేషన్‌కు చెందిన సుకుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. కాగా అజయ్ మృతదేహానికి గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సీసీల వ్యవహారాలపై సీపీ కన్ను!

- ఓ అధికారి, క్లర్క్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు
- మిగిలిన వారి కార్యకలాపాలపై లోతుగా ఆరా
- కొందరు ఇన్‌స్పెక్టర్ల పైనా చర్యలకు రంగం సిద్ధం

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు విభాగంలోని వివిధ అధికారుల వద్ద పని చేస్తున్న క్యాంప్ క్లర్క్స్(సీసీ) వ్యవహారాలపై కొత్వాల్ సీవీ ఆనంద్ ప్రత్యేక దృష్టి పెట్టారు. కొందరిపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో స్పెషల్ బ్రాంచ్(ఎస్బీ) అధికారులతో లోతుగా ఆరా తీయిస్తున్నారు. ఇప్పటికే పలు ఆరోపణలు నిరూపితమైన నేపథ్యంలో ఓ ఉన్నతాధికారి వద్ద పని చేస్తున్న సీసీపై సస్పెన్షన్ వేటు వేశారు. మరికొందరి అంశాన్ని కొత్వాల్ సీరియస్‌గా పరిశీలిస్తున్నారు. నగర కమిషనరేట్‌లో ఏసీపీలు, అదనపు డీసీపీలు, డీసీపీలు, సంయుక్త సీపీలతో పాటు అదనపు సీపీ వద్దా సీసీలు పని చేస్తుంటారు. దాదాపు ప్రతి ఒక్కరూ పరిపాలన విభాగానికి చెందిన వారై ఉంటారు. ఆయా అధికారుల విధి నిర్వహణలో వీరిది కీలకపాత్ర. ఉన్నతాధికారులు, కింది స్థాయి సిబ్బందితో ఉత్తరప్రత్యుత్తరాలతో పాటు ఆయా కార్యాలయాలు, ఏరియాల నిర్వహణలోనూ పాలుపంచుకుంటూ ఉంటారు. జీతభత్యాలు, ఇతర అలవెన్స్‌లకు సంబంధించిన ఫైళ్లను సదరు ఉన్నతాధికారి వద్దకు తీసుకువెళ్లడం, ఆయనతో సంతకం చేయించి క్లియర్ చేయించడం సైతం వీరి పనే. దీన్ని అవకాశంగా మార్చుకుంటున్న కొందరు సీసీలు రెచ్చిపోతున్నారని కొత్వాల్‌కు సమాచారం అందింది. అధికారులు, సిబ్బందితో దురుసుగా ప్రవర్తిస్తున్న వారు కొందరైతే... వసూళ్లకు పాల్పడుతున్న వారి మరికొందరని ఆరోపణలు వచ్చాయి. దీంతో నగర వ్యాప్తంగా అధికారులు, కార్యాలయాల వద్ద పని చేస్తున్న సీసీల కార్యకలాపాలను లోతుగా ఆరా తీయాల్సిందిగా ఆయన ఎస్బీ అధికారులను ఆదేశించారు. వారిచ్చిన నివేదిక ఆధారంగా ఓ సీసీని సస్పెండ్ చేసిన పోలీసు కమిషనర్ మిగిలిన వారి వ్యవహారాన్ని పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మరో అధికారి వద్ద పని చేస్తున్న సీసీకి వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది.